సాక్షి
ప్రకాశం
గురువారం । 1 । మే । 2025



జీవితం..దినగండం
సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా మారాయి. కార్మిక వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం దాని ఊసే మరిచిపోయింది. - 8లో..



ఉరిమిన వరుణుడు
గిద్దలూరు నియోజకవర్గంలోని కంభం, రాచర్ల మండలాల్లో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పెనుగాలులకు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. పలుచోట్ల పిడుగులు పడ్డాయి. - 8లో..

గరిష్టం/కనిష్టం 39 /26

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

ఎయిడెడ్ ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి



ఏడీ వరప్రసాద్‌ను కలిసిన ఏపీ టీచర్స్ గిల్డ్ నాయకులు

ఒంగోలు సిటీ: జిల్లాలో జీరో ఎన్‌రోల్ ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే 49 మంది ఉపాధ్యాయులకు శాశ్వతంగా కౌన్సెలింగ్ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్.ప్రభాకరరెడ్డి కోరారు. డీఈఓ కార్యాలయంలో బుధవారం ఏడీ వరప్రసాద్‌ను కలిసి ఎయిడెడ్ టీచర్ల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్టూరు మండలం, రాజుపాలెం ఎయిడెడ్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రభుత్వంలో విలీనమైందని, అక్కడ పనిచేసే మహిళా ఉపాధ్యాయురాలికి కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. పై సమస్యలను సత్వరమే పరిష్కరించి ఎయిడెడ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని జిల్లా బాధ్యులు కోరారు.

పాలిసెట్‌కు 5,387 మంది హాజరు


ఒంగోలు సిటీ: పాలిసెట్ పరీక్షను బుధవారం 11 కేంద్రాల్లో నిర్వహించారు. ఒంగోలులో 7 కేంద్రాలు, మార్కాపురంలో 4 కేంద్రాల్లో పరీక్ష జరిగిందన్నారు. మొత్తం 4600 మంది విద్యార్థులకు గాను 3950 మంది పరీక్షకు హాజరయ్యారని, 85.86 శాతం హాజరు నమోదైందని ఒంగోలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ శివప్రసాద్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బాలురు 2932 మందికి గాను 2557 మంది పరీక్షకు హాజరుకాగా, 375 మంది గైర్హాజరయ్యారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 1668 మంది బాలికలకు గాను 1393 మంది బాలికలు పరీక్షకు హాజరుకాగా, 275 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

మెప్మా మిషన్ మేనేజర్ కల్పన సస్పెన్షన్

ఒంగోలు సబర్బన్: జిల్లా మెప్మా కార్యాలయంలో మిషన్ మేనేజర్ గుట్లపల్లి కల్పనను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ఆ శాఖ మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్ భారతి ఉత్తర్వులు ఉత్తర్వులు జారీ చేశారు. మదర్ థెరిస్సా వికలాంగుల సేవా సమితి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిషన్ మేనేజర్‌పై విచారణ చేపట్టారు. ఆమె అక్రమాలకు పాల్పడినట్లు మెప్మా పీడీ, ప్రత్యేక కమిటీలు ఇచ్చిన నివేదికల ప్రకారం చర్యలు తీసుకున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వెంటనే ఈ ఉత్తర్వులను అమలు చేయాలని, ఆ స్థానానికి ఇన్‌చార్జ్‌ని నియమించుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాల ఏర్పాటు

- వాటిలో మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు
- వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్



వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాల (ఎంఎన్‌జీయూ) ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ తమీమ్ అన్సారియా వైద్యాధికారులతో బుధవారం సమావేశమయ్యారు. జిల్లాలోని గిద్దలూరు, వై.పాలెం, కొండపి, మార్కాపురం, రిమ్స్ ఆస్పత్రుల్లో నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత మెడికల్ అధికారులతో సమీక్షించి తగు సూచనలు ఇచ్చారు. జిల్లాలో మాతా శిశు మరణాలు తగ్గించడం, పుట్టిన బిడ్డలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే నవజాత శిశువుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు ప్రధాన ఉద్దేశమన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస నాయక్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ నిర్మల్ కుమార్, కమ్యూనిటీ ఎంపవర్‌మెంట్ ల్యాబ్ రీసర్చ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి శ్రావ్య, గిద్దలూరు, వై.పాలెం, కొండపి, మార్కాపురం ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు.



అన్నం పెట్టే అన్నదాత కష్టాల సుడిగుండంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నాడు. పండిన పంటకు గిట్టుబాటు ధరలేదు...ప్రభుత్వం చేయూతనందించకపోగా కనీస మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేసే ఊసేలేదు.. ప్రభుత్వం చెప్పేదానికి, చేసే దానికి పొంతన లేదు. పండించిన పంట దళారుల పరమవుతోంది. ప్రభుత్వ మద్దతు ధరతో ప్రమేయం లేకుండా మిల్లర్లు, దళారులు నిర్ణయించిన ధరకే ధాన్యాన్ని విక్రయించుకోవాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. కొనుగోలు నిబంధనల్లో చేసిన మార్పులు మిల్లర్లు, దళారులకు వరంగా మారగా రైతులకు శాపంగా మారాయి.

గింజకున్నా కొనట్లేదు!

- రైతుకు దక్కని ధాన్యం మద్దతు ధర
- దిగుబడిలో 10 శాతం కూడా కొనుగోలు చేయని వైనం
- దళారీల చేతుల్లో దోపిడీకి గురవుతున్న అన్నదాత
- అందినకాడికి అమ్ముకోవాల్సిన దుస్థితిలో రైతు
- ప్రభుత్వం నుంచి అందని సాయం
- ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేయించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

సాక్షిప్రతినిధి, ఒంగోలు:

జిల్లా వ్యాప్తంగా 32,425 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. అందుకుగాను 76,397 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని అధికారులు చెబుతున్నారు. అందులో కేవలం 10 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలన్నది లక్ష్యంగా పౌర సరఫరాల శాఖ కార్పొరేషన్ నిర్ణయించింది. జిల్లాలోని 27 మండలాల్లో 239 రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌లో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తే 8,900 మెట్రిక్ టన్నులు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. దిగుబడి వచ్చిన దానిలో సగానికి పైగా ధాన్యాన్ని రైతులు గిట్టుబాటు ధర రాకుండానే దళారులకు తెగనమ్ముకున్నారు. ఫలితంగా ధాన్యం పండించిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. కనీసం పండించిన ధాన్యానికి మద్దతు ధర పెంచి 25 నుంచి 30 శాతం అయినా కొనుగోలు చేస్తే రైతుకు కనీసం ఖర్చులైనా వస్తాయని చెబుతున్నారు. అప్పుడు రైతు కష్టాల నుంచి బయటపడే అవకాశం ఉండేది.

ప్రతికూల వాతావరణం...తీవ్ర నష్టం..

మరో పక్క వాతావరణం ప్రతి కూలించటంతో పాటు గాలీ, వాన బీభత్సం, వడగళ్ల వర్షం అన్నదాతను ఉక్కిరి బిక్కిరి చేసింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన వర్షాలకు వరి పంట తీవ్రంగా దెబ్బతింది. పంట నష్టం సంభవించిన దానిపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయే కానీ రైతుకు ఒరిగింది మాత్రం శూన్యం. పంట చేతికొచ్చిన దశలో ఇలాంటి ఇబ్బందులు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కనీసం ప్రభుత్వం ఇన్సూరెన్స్ అవకాశం కూడా కల్పించలేదు. దీనికితోడు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం అమ్మాలంటే రైతులు అనేక వ్యయ ప్రయాసలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా డబ్బులు పెట్టుబడి పెట్టుకుని మిల్లుకు ధాన్యం రవాణా చేయాల్సి రావడం రైతుకు ఇబ్బందిగా మారింది. ఈ పరిస్థితుల్లో పలువురు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువకు దళారులు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ–క్రాప్ విధానంలో నమోదు చేసుకోని పంటను తక్కువ ధరకు అడుగుతున్నారు.

> **కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకుండా మోసం..**
>
> 10 ఎకరాల్లో వరిపంట సాగు చేశాను. ప్రభుత్వం మద్దతు ధర రూ.2320 చొప్పున కొనుగోలు చేస్తుందని ఎంతో ఆశగా ఎదురు చూశాను. తీరా పంట చేతికొచ్చాక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం నిలువునా మోసం చేసింది. దీంతో పంటను దళారులకు అత్యంత చవకగా అమ్ముకోవాల్సి వచ్చింది. వరి రైతులను ఈ ప్రభుత్వం నిలువునా మోసం చేసింది.
>
> – కన్నెదారి వెంకటేశ్వర్లు, దాసరివారిపాలెం, నాగులుప్పలపాడు మండలం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అలా.. కూటమిలో ఇలా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు అప్పటి రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా విక్రయించుకోవాలని కోరుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులు రైతుల చుట్టూ తిరిగేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పరిస్థితిలో మార్పు వచ్చింది. తమ ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు కొనుగోలు కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనాలని, గోనె సంచులు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఆర్థిక చేయూత అందించకపోవడంతో చిన్న, సన్నకారు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో దళారులు, మధ్యవర్తులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేలు ఇస్తానని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం సత్వరమే అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏడాదికి రూ.13,500 చొప్పున ప్రతి సంవత్సరం అందిస్తూ వచ్చింది.

సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేయాలి

- మోకాళ్లపై నిరసన తెలిపిన సీహెచ్‌ఓలు
- రెండో రోజుకు చేరిన నిరవధిక సమ్మె



నిరవధిక సమ్మెలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న సీహెచ్‌ఓలు

ఒంగోలు టౌన్: ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్లకు పైగా పనిచేసిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అనుబంధ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కాలం సుబ్బారావు డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల న్యాయమైన సమస్యల పరిష్కారాన్ని కోరుతూ రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీహెచ్‌ఓలు మోకాళ్లపై నిరసన తెలిపారు. అనంతరం కాలం సుబ్బారావు మాట్లాడుతూ.. బీఎస్సీ నర్సింగ్ నుంచి పీహెచ్‌డీ వరకు ఉన్నత చదువులనభ్యసించి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేకపోవడం విచారకరమన్నారు. సీహెచ్‌ఓల చేత నిర్దిష్టమైన పనులు చేయించకుండా అడ్డగోలు పనులన్నీ చేయించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీహెచ్‌ఓల పీఎఫ్ సౌకర్యాన్ని ఎందుకు రద్దు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. గత సంవత్సరం కాలంగా ఇంక్రిమెంట్లు, అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. తమ న్యాయమైన హక్కుల సాధన కోసం సమ్మె చేస్తున్నామని ఏపీఎంసీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యం.రాజేష్ చెప్పారు. ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారం విషయంలో సానుకూలంగా స్పందించాలని కోరారు. చర్చల ద్వారా తమ సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా నాయకులు ఏ.నిర్మల, జీవన జ్యోతి, ప్రసన్న, సయ్యద్ గౌస్ పాల్గొన్నారు. జిల్లాలోని 538 మంది సీహెచ్‌ఓలు ఈ సమ్మెలో పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపిస్తాం

- పొగాకు, మిర్చి, వరి పంటలు వేసిన రైతుల దుస్థితి వర్ణనాతీతం
- పొగాకు రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ప్రభుత్వం కల్పిస్తోంది
- రైతులకు వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుంది
- రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి
- ధర గిట్టుబాటు కావడంలేదంటూ మొరపెట్టుకున్న పొగాకు రైతులు



మీడియాతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

మద్దిపాడు: కూటమి ప్రభుత్వం కళ్లు మూసుకుపోయి రైతులను పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి విమర్శించారు. మద్దిపాడు మండలం వెల్లంపల్లి గ్రామంలోని పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్ల తీరును బుధవారం పరిశీలించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆయనతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పొగాకు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేయించి మార్కెట్‌ను నిలబెట్టారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని వాపోయారు. ఈ సంవత్సరం పొగాకు సరిగా పండలేదని, పంట ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. కూలీ, బ్యారన్‌ల అద్దెలు పెంచేశారని, దీని వలన రైతులకు ఖర్చు పెరిగిందన్నారు. కోల్డ్ స్టోరేజీల్లో ఉంచిన పొగాకు రంగు మారిపోతుందని, వేలం కేంద్రాల్లో పొగాకును కంపెనీల బయ్యర్లు కొనుగోలు చేయడం లేదన్నారు. దీంతో పాటు అన్ని కంపెనీల వారు ఫ్లోర్‌లో కొనుగోలుకు రావడం లేదని తెలిపారు. వేలం కేంద్రాలకు తీసుకొచ్చిన పొగాకు బేళ్లను నోబిడ్ చేయడం వలన రైతు ప్రత్యక్షంగా నష్టపోతున్నారని వివరించారు.

అనంతరం వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ పొగాకు, వరి, మిర్చి, శనగ పంటలు వేసిన రైతులు చాలా కష్టాలు పడుతున్నారని, ఏ పంటకూ గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించి పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతుల పక్షాన నిలిచిందన్నారు. గత సంవత్సరం కేజీ పొగాకు రూ.360 ఉంటే ఈ ఏడాది కేవలం రూ.250కు కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. ఒక ఎకరా పంటకు సుమారు రూ.2.50 నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చులు అవుతాయని, కౌలుకు తీసుకున్న రైతుకైతే మరో రూ.50 వేలు అదనంగా అవుతాయన్నారు. ఈ ఏడాది అకాల వర్షాలతో పంట దిగుబడి తగ్గిందని, నాణ్యత కూడా లేదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొగాకు రైతుల పక్షాన నిలిచి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి వారికి గిట్టుబాటు ధర కల్పించారన్నారు. అన్నిరకాల పంటలకు మద్దతు ధర ఇవ్వడానికి రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. వైఎస్సార్ ఫసల్ బీమా పథకం ద్వారా బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించిందని, పంట నష్టపోయిన రైతులకు వారి ఖాతాల్లో పంట నష్టపరిహారం అందించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రీమియం కట్టకుండా వదిలేసిందని, రైతులే ప్రీమియం కట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుల సమస్యలపై వైఎస్ జగన్‌తో చర్చిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోతే వచ్చే 15 రోజుల్లో వైఎస్సార్ సీపీ తరఫున పోరాటం ఉధృతం చేస్తామన్నారు. 2014–19 వరకూ అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వంలో పలువురు పొగాకు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, అప్పుడు కూడా ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పొగాకు రైతుల పక్షాన నిలబడి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చి ఆత్మహత్య చేసుకున్న పొగాకు రైతుల కుటుంబాలను కేంద్ర మంత్రులు వచ్చి పరామర్శించి వారికి నష్ట పరిహారం ఇప్పించేందుకు కృషిచేశామని ఆయన గుర్తు చేశారు.



పొగాకు బేళ్లను పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, పక్కన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, కనిగిరి ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ తదితరులు

సింహాచలంలో భక్తుల మృతిపై సంతాపం

సింహాచలంలో గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందడంపై వైవీ సుబ్బారెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరుపతిలో తొక్కిసలాట జరిగి పలువురు చనిపోయారని, ఇప్పుడు సింహాచలంలో గోడ కూలి భక్తులు మృతి చెందారన్నారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే కార్యక్రమాల్లో ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున, మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్, గిద్దలూరు పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, ఒంగోలు, కనిగిరి నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలు చుండూరి రవి బాబు, దద్దాల నారాయణ యాదవ్, ఒంగోలు పార్లమెంట్ పార్టీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శి పేరాల చెన్నకేశవులు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వైఎస్ఆర్‌సీపీ సంతనూతలపాడు అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, నాగులుప్పలపాడు అధ్యక్షుడు పోలవరపు శ్రీమన్నారాయణ, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మన్నం శ్రీధర్, గంటా ఆంజనేయరెడ్డి, డాకా పిచ్చిరెడ్డి, మద్దిపాడు మండల ఉపాధ్యక్షులు వాకా కోటిరెడ్డి, మండవ బాల చంద్రమౌళి, నాగులుప్పలపాడు మండల సీనియర్ నాయకుడు నలమలపు కృష్ణారెడ్డి, తాళ్లూరు మండల పార్టీ అధ్యక్షుడు కేవీ రమణారెడ్డి, సంతనూతలపాడు జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, మాజీ ఏఎంసీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, రైతు సంఘం నాయకులు పల్లకి సత్యన్నారాయణరెడ్డి, మహానందరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నారా సుబ్బారెడ్డి, పోలినేని కోటేశ్వరరావు, పీ సంధ్య, రజనీకుమారి, సన్నపురెడ్డి రమణమ్మ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కీలక దశకు చేరిన విచారణ

- వీరయ్య చౌదరి హత్యకేసులో నెల్లూరులో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం
- ఒకే రోజు డీఎస్పీ కార్యాలయంలో 12 మందిని విచారించిన ఎస్పీ
- కీలక నిందితుల కోసం కొనసాగుతున్న గాలింపు



వీరయ్య చౌదరి మృతదేహం (ఫైల్)

ఒంగోలు టౌన్: దారుణ హత్యకు గురైన టీడీపీ నేత వీరయ్య చౌదరి హత్యకేసు కీలక దశకు చేరినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో సంచలనం కలిగించిన ఈ హత్యకు సంబంధించి రోజుకో రకంగా కథనాలు ప్రచారం జరుగుతూనే ఉన్నాయి. పోలీసు బృందాలు పొరుగు రాష్ట్రాలతో పాటు, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కీలక నిందితుల కోసం గాలిస్తూనే ఉన్నాయి. గత నెల 22వ తేదీ రాత్రి 7.30 గంటలకు వీరయ్య చౌదరి హత్య జరిగింది. దాదాపు పదిరోజులు అవుతోంది. ఇంకా కీలక నిందితుల ఆచూకీ లభించకపోవడం గమనార్హం. అయితే వారి బంధువుల ద్వారా పూర్తి సమాచారాన్ని సేకరించే పనిలో పడ్డారని తెలుస్తోంది.

12 మంది విచారణ

ఇప్పటి వరకూ ఈ కేసులో దాదాపు వంద మందికి పైగా అనుమానితులను, నిందితుల బంధువులు, స్నేహితులు, హత్యకు గురైన వీరయ్యచౌదరి సన్నిహితులను, ఆయన స్వగ్రామానికి చెందిన పలువుర్ని పోలీసులు విచారించారు. అయితే నగర డీఎస్పీ కార్యాలయంలో బుధవారం రాత్రి 11 వరకు కూడా ఎస్పీ ఏఆర్ దామోదర్ దాదాపు 12 మందిని విచారించినట్టు సమాచారం. హత్యలో పాల్గొన్న కీలక నిందితుల బంధువులను, మిత్రులతో పాటు పలువురు అనుమానితులను అదుపులోనికి తీసుకుని విచారించినట్టు తెలిసింది. అమ్మనబ్రోలుకు చెందిన ప్రధాన అనుమానితుడి తల్లిదండ్రులతో పాటుగా అతడి సోదరుడిని విచారించినట్లు సమాచారం. అలాగే నాగులుప్పలపాడు మండలం పోతవరం గ్రామానికి చెందిన ఒక నాయకుడిని, చినగంజాంకు చెందిన ఒక ఎంపీటీసీని కూడా విచారించినట్లు తెలుస్తోంది. నగరంలోని ఒక పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న కార్‌షాపీకి రోజూ ప్రధాన అనుమానితుడు వస్తుంటాడని, అక్కడి వారితో కలిసి హత్యకు ముందు భోజనం చేశాడని పోలీసులకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కార్‌షాపీ మిత్ర బృందంలోని ఐదుగురిని విచారించినట్లు సమాచారం. ఒంగోలు మండలంలోని వెంకటరాజుపాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఇటీవల ఒక గృహప్రవేశం సందర్భంగా ప్రధాన అనుమానితుడితో కలిసి ఫొటో దిగినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండడంతో అతడిని కూడా విచారణకు పిలిపించారని తెలిసింది. వారితో పాటుగా హత్యతో కీలక పాత్ర పోషించినట్లు చెబుతున్న కొప్పోలు వ్యక్తి అక్కా బావలను విచారించినట్లు సమాచారం.

రోజుకో చోట భోజనం...

వీరయ్య హత్య కేసులో నిందితులు నగరంలోని గుంటూరు రోడ్డులో ఉన్న ఒక లాడ్జీలో ఉండి పది రోజుల పాటు రెక్కీ నిర్వహించినట్లు ప్రచారం జరగడం తెలిసిందే. అయితే నిందితులకు ప్రతి రోజు భోజనం తీసుకెళ్లి ఇచ్చినట్లు కొప్పోలు నిందితుడి బావమరిది అంగీకరించినట్లు ప్రచారంలో ఉంది. అయితే నిందితులు నేరుగా లాడ్జికి భోజనం తీసుకొని రాకుండా రోజుకో చోటకు తీసుకొని రమ్మని చెప్పేవారని సదరు వ్యక్తి పోలీసులకు వివరించినట్టు సమాచారం. అలాగే నిందితుల గురించి తనకు ఎలాంటి సమాచారం తెలియదని చెప్పినట్లు తెలుస్తోంది.

నెల్లూరులో ఇద్దరిని అదుపులోకి..

వీరయ్య హత్యలో నలుగురు పాల్గొన్నారని పోలీసులు మొదట నుంచి చెబుతున్నారు. అయితే స్కూటీ క్లూ తరువాత పాత్రధారులంతా ఒంగోలు, పరిసర ప్రాంతాలకు చెందిన వారేనని ప్రచారం జరిగింది. ఇప్పుడు నెల్లూరుకు చెందిన యువకులకు సుపారి ఇచ్చి హత్య చేయించినట్లు చెప్పుకుంటున్నారు. బుధవారం నెల్లూరులో ఇద్దరు పాత్రధారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే వారు అసలు నిందితులు కాదని, హత్య జరిగిన తరువాత జరిగిన ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్‌ల ఆధారంగా ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఇప్పటి వరకు పోలీసు అధికారులు అధికారికంగా ఈ విషయాన్ని ధ్రువీకరించకపోవడం గమనార్హం.

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు ఒంగోలు రూడ్‌సెట్ సంస్థ డైరెక్టర్ పీ శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 20వ తేదీ నుంచి 30 రోజుల పాటు ఈ ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువకులు అర్హులన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన వసతి కల్పిస్తారని చెప్పారు. ఇతర పూర్తి వివరాలకు 9573363141 అనే నంబరును సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో నియామకాలు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన ఇద్దరిని పార్టీ రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీ జనరల్ సెక్రటరీగా దర్శికి చెందిన కుమ్మిత అంజిరెడ్డి, సెక్రటరీగా గిద్దలూరుకు చెందిన వేమిరెడ్డి రామచంద్రారెడ్డిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయ వర్గాలు తెలిపాయి.

వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ

ఒంగోలు: ప్రకాశం జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే నెలలో బాలురకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ జి.ధనుంజయరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మంగమూరు రోడ్డులోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 17 ఏళ్ల లోపు వయసు, 180 సెంటీమీటర్ల కనీస ఎత్తు కలిగిన బాలురు అర్హులని స్పష్టం చేశారు. మే 2వ తేదీ సాయంత్రం 3 గంటలకు ఒంగోలులోని డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు 9490382802ను సంప్రదించాలని సూచించారు.

3న బాస్కెట్‌బాల్ సబ్ జూనియర్ జట్ల ఎంపిక

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా బాస్కెట్ బాల్ సబ్ జూనియర్ బాలబాలికల క్రీడా జట్ల ఎంపిక ఈనెల 3న కందుకూరులోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి తొట్టెంపూడి సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2012 జనవరి ఒకటో తేదీ తర్వాత జన్మించిన వారు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. ఎంపికైన వారు ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు చిత్తూరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఎంపికకు హాజరయ్యే బాలబాలికలు తమ వెంట పుట్టిన తేదీ ధ్రువపత్రం తీసుకురావాలని, వివరాలకు 9866126955ను సంప్రదించాలని సూచించారు.

నీటి కుంటలో పడి వృద్ధురాలి మృతి

హనుమంతునిపాడు: గేదెలకు నీరు తాపే క్రమంలో ప్రమాదవశాత్తు కుంటలో పడి ఓ వృద్ధురాలు మృత్యువాత పడింది. ఈ సంఘటన బుధవారం మండల కేంద్రమైన హనుమంతునిపాడు–మోరవారిపల్లి గ్రామాల మధ్య ఎర్రవాగులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మోరవారిపల్లి గ్రామానికి చెందిన కొండా సీతయ్య భార్య కొండా పుల్లమ్మ(77) తమ గేదెలను మేత కోసం ఎర్రవాగు వైపు తోలుకెళ్లింది. మధ్యాహ్నం సమయంలో గేదెలకు నీరు తాపేందుకు వాగులోని నీటి కుంట వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు జారి నీటి కుంటలో పడటంతో ఊపిరాడక మృతి చెందింది. రోడ్డు పనుల కోసం మట్టి తోలుతున్న జేసీబీ, టిప్పర్ డ్రైవర్లు నీటి కుంటలో తేలియాడుతున్న చీరను గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు వచ్చి పరిశీలించి పుల్లమ్మ మృతదేహాన్ని బయటకు తీశారు.

వృద్ధుడు ఆత్మహత్య



మస్తాన్ మృతదేహం

జరుగుమల్లి(సింగరాయకొండ): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ సంఘటన జరుగుమల్లి మండలం నందనవనంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొడుగు మస్తాన్ సాహెబ్(85) గత కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. బుధవారం ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని కలుపు నివారణకు వినియోగించే పురుగుమందు తాగారు. కుటుంబ సభ్యులు గుర్తించి 108 అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

ఏఎస్సై దంపతులకు ఎస్పీ సన్మానం



ఏఎస్సై నారాయణరెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: పట్టుదల, కృషితో అంచెలంచెలుగా ఎదిగి బేస్తవారపేట ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన పి.నారాయణరెడ్డి సేవలను పోలీసు శాఖ ఎప్పటికీ మరచిపోదని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ చాంబర్లో నారాయణ రెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ.. 35 ఏళ్ల పాటు పోలీసు శాఖలో సమర్థవంతంగా పనిచేస్తూ, క్రమశిక్షణతో విధులు నిర్వహించారని కొనియాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని, మంచిపేరే చిరస్థాయిగా నిలిచిపోతుందని చెప్పారు. శేష జీవితం కుటుంబంతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్సై తిరుపతిస్వామి, ఏఎస్సై కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అణగారిన శ్రమశక్తిని ఆవేశం ఊపిరిగా రగిలించి కదిలించిన రోజు..
అన్యాయం, అక్రమాలను నిలదీసిన రోజు..
లోకానికి శ్రమ విలువను చాటిన రోజు..
శ్రమజీవుల వెచ్చటి నెత్తురు కేతనమై నిలిచిన రోజు
సమభావం మానవాళి గుండెల్లో నిండాలని..
సకల దేశ కార్మికులు చేసుకునే పండగ రోజు.. మేడే
నేడు కార్మికులు పండగ చేసుకుంటున్నారా? లేదు.. జానెడు పొట్ట నింపుకొనేందుకు స్వేదం చిందిస్తున్నారు. కుటుంబాలను నెట్టుకొచ్చేందుకు పోరాడుతున్నారు. శ్రమను గుర్తించాలని, కార్మిక సంక్షేమ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, రాయితీలు పక్కదారి పట్టకుండా చూడాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు.
గురువారం మేడే సందర్భంగా కార్మికుల కష్టాలపై ప్రత్యేక కథనం..



జీవితం దినగండం

గాలిలో దీపంలా కార్మికుల సంక్షేమం

- సంఘటిత, అసంఘటితరంగ కార్మికులకు అందని గుర్తింపు కార్డులు
- సంక్షేమ బోర్డు పునరుద్ధరణ ఊసే మరిచిన కూటమి సర్కారు
- మామూళ్ల మత్తులో జోగుతున్న కార్మిక శాఖ అధికారులు
- కనీసం సర్వేలకూ నోచుకోని వైనం
- హామీలిచ్చి అడ్రస్ లేని కూటమి నేతలపై కార్మిక సంఘాల ఆగ్రహం

కనిగిరి రూరల్:

సంఘటిత, అసంఘటిత కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా మారాయి. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం, కార్మిక వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామంటూ ఎన్నికల్లో హామీలు గుప్పించిన కూటమి నేతలు గద్దెనెక్కి 10 నెలలైనా వాటి ఊసే ఎత్తడం లేదు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకపోగా కనీసం గుర్తింపు కార్డులకు కూడా కార్మికులు నోచుకోలేదు. ఇటీవల అనేక మంది కార్మికులు వివిధ కారణాలతో క్షతగాత్రులుగా మారినా.. వారికి ఎటువంటి సహాయ సహకారాలు దక్కలేదు. ఫలితంగా కార్మిక రంగం కన్నీరు పెడుతోంది. కార్మిక హక్కులను కాలరాస్తూ, సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కార్మిక నేతలు ధ్వజమెత్తుతున్నా లేశమంతైనా స్పందించడం లేదు.

జిల్లాలో సుమారు 1.50 లక్షల మందికి పైగా కార్మికులున్నారు. చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమల్లో 17 వేల మంది, మార్కాపురం పలకల గనుల్లో సుమారు 5 వేల మంది కార్మికులు పనులు చేస్తున్నారు. భవన నిర్మాణ రంగంలోని 21 శాఖల పరిధిలో సుమారు 1.20 లక్షల మంది కార్మికులున్నట్లు అంచనా. క్వారీ, భవన నిర్మాణ రంగ కార్మికులతోపాటు ఆర్టీసీ, మున్సిపల్, డిపో ముఠా కూలీలు, హమాలీలు, మీటర్ రీడింగ్ కార్మికులు, ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వారు, ఉపాధి హామీ, వ్యవసాయ రంగ కూలీలు, బోర్ వెల్స్, సిమెంట్ వరలు, ఇటుకల తయారీ రంగాలపై ఆధార పడి జీవించే అసంఘటిత కార్మికులకు గుర్తింపు కార్డుల జారీలో కూటమి సర్కారు మీనమేషాలు లెక్కిస్తోంది. కార్మికుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా అదేమీ పట్టించుకోవడం లేదు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు రూ.1,000 నుంచి రూ.5 వేల వరకు పింఛను మంజూరు చేయాల్సి ఉండగా ఆ ఊసే ఎత్తడం లేదు.

కార్మికులపై చిన్న చూపు

కార్మికుడు పనిచేసే చోట ప్రమాదం జరిగితే పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కార్మిక నేతలు గట్టిగా ప్రశ్నిస్తే కాంట్రాక్టర్ ఎంతో కొంత నగదు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నాడు. ఫలితంగా భవన నిర్మాణ రంగ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. క్షత గాత్రులైన కార్మికుల కుటుంబాలు క్రమంగా అప్పుల ఊబిలో చిక్కుకుంటున్న దుస్థితి. గతంలో మాదిరిగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఉంటే తద్వారా సాయమందేది. బోర్డును పునరుద్ధరించకపోవడంతో కార్మికులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

హామీలిచ్చారు.. అడ్రస్ లేరు..

ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు భవన నిర్మాణ కార్మికులను ఆదుకుంటామని, సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. కార్మికుడు సహజ మరణం పొందితే రూ.60 వేలు, మట్టి ఖర్చులకు రూ.20 వేలు చెల్లిస్తామన్నారు. పనిచేసే ప్రాంతంలో ప్రమాదం జరిగి కార్మికుడు మృతి చెందింతే రూ.5లక్షలు, మట్టి ఖర్చులకు రూ.20 వేలు చెల్లిస్తామని చెప్పారు. ప్రమాదంలో పూర్తి అంగ వైకల్యం పొందితే రూ.5 లక్షలు, పాక్షిక వైకల్యానికి పర్సంటేజీ నగదు చెల్లిస్తామని నమ్మబలికారు. ఇది కాకుండా మహిళా కార్మికుల తొలి కాన్పు, మలి కాన్పునకు రూ.20 వేల చొప్పున అందిస్తామని, అనారోగ్యంతో ఆస్పత్రి పాలైతే ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున పరిహారం చెల్లిస్తామన్నారు. 60 ఏళ్లు దాటిన వృద్ధ కార్మికుడికి సంక్షేమ బోర్డు ద్వారా పెన్షన్ అందిస్తామని చెప్పుకొచ్చారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి పది నెలలు దాటినా ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయకపోవడంపై కార్మిక నేతలు, కార్మికులు మండిపడుతున్నారు. భవనాలు, పరిశ్రమల యజమానులతో కార్మిక శాఖ అధికారులు లాలూచి పడి శ్రమజీవులకు ద్రోహం చేస్తున్నారని వివిధ కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

గుర్తింపు కార్డుతో ప్రయోజనాలివీ..

భవన యజమానులు తమ వద్ద పనిచేసే కార్మికుల పేరిట ఒక శాతం సెస్ చెల్లించాల్సి ఉంటుంది. గుర్తింపు కార్డులు ఉన్న కార్మికుల పిల్లలకు ఉచిత విద్య అందించాలి. వివాహాలకు నగదు చెల్లించాలి. ప్రమాద బీమా, శాశ్వత వికలాంగత్వ బీమా, ప్రాణ నష్ట పరిహారం పొందేందుకు గుర్తింపు కార్డులు ఉపయోగపడతాయి.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయి. కార్మికులకు అందాల్సిన సౌకర్యాలు నిలిపివేయడం దుర్మార్గం. కార్మిక సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలి. సంఘటిత, అసంఘటిత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతున్నాం. కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి. కార్మికుల హక్కులను కాలరాస్తే ఉద్యమాలను ఉధృతం చేస్తాం.

– సయ్యద్ యాసీన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు



ఘనంగా వైవీ సుబ్బారెడ్డి జన్మదిన వేడుకలు

ఒంగోలు సిటీ: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి జన్మదినం గురువారం కాగా ముందస్తుగా బుధవారం ఆయన నివాసంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డిని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ మంత్రులు కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గా ఇన్‌చార్జులు ఆదిమూలపు సురేష్, మేరుగు నాగార్జున, మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, ఒంగోలు, కనిగిరి నియోజకవర్గాల ఇన్‌చార్జులు చుండూరి రవిబాబు, దద్దాల నారాయణ యాదవ్, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ ప్రసాద్, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటేశ్వరరావు, బీసీ నాయకుడు బొట్ల రామారావు, కార్పొరేటర్ ఇమ్రాన్‌ఖాన్ తదితరులు సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి వేడుకలో పాల్గొన్నారు.

పొట్ట కూటికి వెళ్లి అనంత లోకాలకు..

- తిరుపతి తుడా లేఔట్ ప్రమాదంలో ముగ్గురు మృతి
- వారిలో ఇద్దరు వ్యక్తులు అనకర్లపూడి వాసులు
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు



తన్నీరు వసంత్ (ఫైల్)



కుంచాల శ్రీనివాసులు(ఫైల్)

కొండపి: తిరుపతి నగరంలోని తిరుమలనగర్ తుడా క్వార్టర్స్‌లో ఐదో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి ముగ్గురు కార్మికులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటన కొండపి మండలంలోని అనకర్లపూడిలో విషాదం నింపింది. మృత్యువాతపడిన ముగ్గురు కార్మికుల్లో ఇద్దరు అనకర్లపూడి వాసులు కావడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన తన్నీరు వసంత్(40), కుంచాల శ్రీనివాస్(42) తమ కుటుంబాలతో కలిసి భవన నిర్మాణ పనుల నిమిత్తం తిరుపతికి వలస వెళ్లారు. తిరుపతి జిల్లా మంగళం పరిధిలోని తిరుమలనగర్‌లో తుడా క్వార్టర్స్‌లో హెచ్ఐజీ ఫ్లాట్ నంబర్ 63లో నిర్మిస్తున్న భవనంలో పనిచేస్తున్నారు. ఐదో అంతస్తులో నలుగురు మేస్త్రీలు పూత పని చేస్తున్న క్రమంలో సారవ నుంచి ఓ కర్ర జారిపోవడంతో ఒక్కసారిగా కిందకు పడిపోయారు. ఈ ఘటనలో తన్నీరు వసంత్, కుంచాల శ్రీనివాసులు అక్కడికక్కడే మతి చెందారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ఇద్దరు వ్యక్తులు చనిపోవడంతో భార్యాపిల్లల రోదనలు మిన్నంటాయి. తన్నీరు వసంత్‌కు భార్య నారాయణమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుంచాల శ్రీనివాస్‌కు భార్య నారాయణమ్మ కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాలు బుధవారం రాత్రి అనకర్లపూడి చేరుతాయని బంధువులు తెలిపారు.

ఉరిమిన వరుణుడు

- కంభం, రాచర్ల మండలాల్లో భారీ వర్షం
- హజరత్‌గూడెంలో పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి
- రావిపాడులో ఆలయంపై పిడుగుపడి చెలరేగిన మంటలు
- అనుమలవీడులో కూలిన 20 పొగాకు షెడ్లు



రావిపాడులో వేణుగోపాల స్వామి ఆలయంపై పిడుగుపడి చెలరేగిన మంటలు



అనుమలవీడులో కూలిన పొగాకు షెడ్

కంభం/రాచర్ల: గిద్దలూరు నియోజకవర్గంలోని కంభం, రాచర్ల మండలాల్లో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షానికి ముందు పెనుగాలులు వీయడంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. కొన్ని చోట్ల రేకులు ఎగిరి విద్యుత్ తీగలపై పడటంతో సరఫరాకు అంతరాయం కలిగింది. కంభం మండలంలోని హజరత్‌గూడెంలో పిడుగుపాటుకు వెంకటేశ్వర్లు అనే రైతుకు చెందిన రూ.1.50 లక్షల విలువైన రెండు గేదెలు మృతి చెందాయి. రావిపాడులో వేణుగోపాల స్వామి ఆలయంపై పిడుగు పడి మంటలు చెలరేగడంతో కంభం అగ్నిమాపక సిబ్బంది వెళ్లి ఆర్పివేశారు. తురిమెళ్ల సమీపంలోని పంట పొలాల్లో పలు చోట్ల పిడుగులు పడ్డాయి. ఈదురుగాలుల ధాటికి అరటి చెట్లు నేలకొరిగాయి.

రాచర్ల మండలంలోని గౌతవరం, అనుములపల్లె, అక్కపల్లె, అనుమలవీడు, పాలకవీడు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. అక్కపల్లె–తురిమెళ్ల మార్గంలో భారీ వేపచెట్టు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. అనుమలవీడులో 20 పొగాకు షెడ్లు కూలిపోయాయి. పొగాకు మండెలు తడవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

హైవేపై అదుపుతప్పిన కారు

- ప్రమాదంలో ఒకరు దుర్మరణం
- తల్లిని చూసేందుకు వెళ్తుండగా ఘటన



కృష్ణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుమన్

సీఎస్‌పురం(పామూరు): తల్లిని చూసేందుకు వెళ్తున్న ఓ వ్యక్తి కారు అదుపుతప్పి బోల్తా పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం పామూరు మండలంలోని కంభంపాడు, కోవిలంపాడు గ్రామాల మధ్య జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్సై కథనం మేరకు వివరాలు.. మండలంలోని అరివేముల గ్రామానికి చెందిన బాణాల కృష్ణ గత కొంతకాలంగా బెంగళూరులో కార్పెంటర్‌గా పనిచేస్తూ కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఏప్రిల్ 28వ తేదీన కృష్ణ తన అత్తగారి ఊరైన కనిగిరి మండలంలోని బల్లిపల్లె వచ్చాడు. రెండు రోజులు అక్కడ గడిపి సీఎస్‌పురం మండలంలోని అరివేములలో ఉంటున్న తన తల్లిని చూసేందుకు కారులో బయలుదేరాడు. ఈ క్రమంలో పామూరు మండలంలోని కంభంపాడు–కోవిలంపాడు మధ్య హైవేపై కారు అదుపుతప్పి రోడ్ మార్జిన్‌లో బోల్తా కొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణ అక్కడికక్కడే మృతిచెందగా కారు నుజ్జునుజ్జయింది. మృతునికి భార్య నాగమణి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై ఆర్.సుమన్ పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిమిషాల్లోనే ఇంటికి.. అంతలోనే విషాదం

మరికొద్ది నిమిషాల్లో ఇంటికి వెళ్లి తన తల్లిని చూస్తాననుకున్న కృష్ణను ఊహించని రీతిలో మృత్యువు బలితీసుకుంది. కృష్ణ మృతితో స్వగ్రామంతోపాటు అత్తగారి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కుమారుడి కోసం ఎదురుచూస్తున్న ఆ తల్లి.. తన కుమారుడు ఇక ఎప్పటికీ తిరిగిరాడని తెలిసి గుండెలవిసేలా రోదిస్తోంది.

ఆవు పాల ధర పెంచాలి

- గత ఏడాది లీటరు రూ.40.. ఇప్పుడేమే రూ.34
- ఇలాగైతే డెయిరీ ఫామ్‌లు మానుకుంటాం
- కలెక్టర్ ఎదుట డెయిరీ ఫామ్ యజమానుల ఆవేదన



పాల ధర పెంచాలని కలెక్టర్‌ను కోరుతున్న వెంకట్రావు, సిరాజ్

కొత్తపట్నం: పాల ధరలు పడిపోవడంతో డెయిరీ నిర్వహణ భారంగా మారిందని వాటి యజమానులు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తపట్నం మండలం రంగాయపాలెంలో కృష్ణం వెంకట్రావు 32 ఆవులతో నడుపుతున్న డెయిరీ ఫామ్‌ను కలెక్టర్ బుధవారం సందర్శించారు. పెట్టుబడి, మిగులు ఆదాయం, కష్టనష్టాలు తెలుసుకున్నారు. డెయిరీ యమాజని కృష్ణం వెంకట్రావు మాట్లాడుతూ.. రూ.25 లక్షల పెట్టుబడి పెట్టానని, పాలపై వస్తున్న ఆదాయం ఈఎంఐలు, కూలి, దాణా ఖర్చులకు సరిపోవడం లేదని కలెక్టర్‌కు వివరించారు. గత ఏడాది లీటర్ ఆవు పాలు రూ.40 కాగా ఈ ఏడాది రూ.35కు పడిపోయిందని తెలిపారు. లీటరు పాలపై రూ.6 వరకు ధర పడిపోవడంతో డెయిరీ మూత వేసే యోచనలో ఉన్నట్లు మరో నిర్వాహకుడు షేక్ సిరాజ్ కలెక్టర్ ఎదుట ఆవేదన వెలిబుచ్చారు. లీటరు పాలకు రూ.40 దక్కేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మాదక ద్రవ్యాల నివారణే లక్ష్యం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్ తదితరులు

ఒంగోలు సబర్బన్: జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించడమే ఏకైక మార్గమని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. డ్రగ్స్ వినియోగంతో కలిగే దుష్ఫలితాలపై విస్తృత ప్రచారం చేయడంతోపాటు నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్స్ కంట్రోల్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. డ్రగ్స్‌ను పూర్తి స్థాయిలో నివారించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వచ్చే విద్యాసంవత్సరం నాటికి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడా గంజాయి సాగు లేదని చెప్పారు. జిల్లా మీదుగా రవాణా అవుతున్న గంజాయిని అరికట్టేందుకు పటిష్టమైన చర్యలను తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం డ్రగ్స్ నియంత్రణపై రూపొందించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వర రావు, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, డీఆర్ఓ చిన ఓబులేసు, ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మా నాయక్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ బాయ్‌పై గంజాయి మత్తులో దాడి



సుధాకర్‌పై దాడి చేస్తున్న వ్యక్తులు

టంగుటూరు: గంజాయి మత్తులో ఉన్న వ్యక్తులు పెట్రోల్ బంక్‌లో పనిచేసే యువకుడిపై దాడికి తెగబడ్డారు. బుధవారం రాత్రి టంగుటూరులో చోటుచేసుకున్న ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు సుధాకర్ ఒంగోలు జీజీహెచ్‌లో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. అందిన సమాచారం మేరకు వివరాలు.. టంగుటూరులోని నయారా పెట్రోల్ బంకుకు గంజాయి మత్తులో ముగ్గురు వ్యక్తులు వచ్చారు. పెట్రోల్ తాలూకు నగదు విషయంలో బంక్ పంప్ బాయ్ సుధాకర్‌తో గొడవకు దిగారు. బంక్‌లో ఉన్న పరికరాలతో మోదడంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. అతని పరిస్థితి విషమంగా ఉందని, రిమ్స్ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్నాడని బంక్ సిబ్బంది తెలిపారు. సీసీ పుటేజీలో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

FLATS / PLOTS FOR SALE
■ ఒంగోలు కార్పోరేషన్ పరిధిలో గది 32 వేలు నుండి 1,30,000 వేలు వరకు DTC అప్రూవల్ కన్వర్షన్ వెంచర్లలో ప్లాట్లు కొనుగోలుకు ఉన్నవి. మరియు అపార్ట్‌మెంట్స్, ఇల్లుకొత్తవి, పాతవి కలవు. కావలసిన వారు సంప్ర॥ ✆ 98489 86437, 94914 15712 [O-190195]

FLAT FOR SALE
■ ఒంగోలుసిటీ రాంనగర్ 2వ లైన్లో లక్ష్మీహోమ్స్ లో ప్రీమియం 3BHK ఫ్లాట్ నె.401 అమ్మబడును. సెల్ ✆ 9246800619,9848152681 [SCA25002945]

Wanted
■ ప్రముఖ విద్యా సంస్థకు టెలీ కాలర్స్ కావలెను. అర్హత : ఇంటర్ / డిగ్రీ. సంప్రదించండి. సెల్ : 70362 62986, 90324 02018. [SCA25003092]
■ ఒంగోలు నగరంలో హాస్టల్ నందు వంటచేయుటకు స్త్రీలు కావలెను. మంచి జీతం, భోజనం, వసతి కల్పించబడును సెల్ : 6304188147 [SCA25002978]

వివరాలకు సంప్రదించండి : క్లాసిఫైడ్స్ : ఒంగోలు 90102 02762

■ శివ ఆర్ట్స్ గుంటూరురోడ్డు, ఒంగోలు నందు పనిచేయుటకు తెలుగు టైపింగ్ ఫోటోషాప్ లో అనుభవం కలిగిన కంప్యూటర్ ఆపరేటర్ వెంటనే కావలెను ఆకర్షణీయమైన జీతం కలదు. సంప్ర : సెల్ : 9848681008 [SCA25002980]
■ పయనీర్ హోండా ఒంగోలు నందు టెలీకాలర్స్ (లేడీస్)-3, సిస్టమ్ ఆపరేటర్స్ (M/F)-2, సర్వీస్ అడ్వయిజర్స్-2 పనిచేయుటకు కావలెను. ✆ 97054 61160, 93980 27849. [OA- 406]
■ కనిగిరి KTR టెక్నో స్కూల్ నందు పనిచేయుటకు 1 నుండి 10వరకు టీచర్స్, వార్డెన్లు, వంట మనుషులు కావలెను. సెల్ : 9951056560, 8466950898 [G-9990]
■ రేవల్లె, సజ్జావారిపాలెం భారత్ పెట్రోల్ బంకులో పనిచేయుటకు ఆసక్తిగలవారు కావలెను. చదువు/ వయస్సు/ అనుభవం నిబంధన లేదు. మంచి జీతం+ వసతి+ శిక్షణ. 92461 64672 [G-9998]
■ We are hiring Sales & Store Managers, Sales Associates & Sweepers. Sal:12k-25k Fabful, M.M.Road, Ongole. ✆8977212861 [SCA25003077]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.